క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

జడ్చర్ల: పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఓటరు తుది జాబితాను త్వరలోనే వెలువరిస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, సీఐ రమేశ్‌బాబు, తహసీల్దార్ శ్రీనువాసులు, తదితరులు పాల్గొన్నారు. కాగా కొత్తగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు.

పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపట్టాలి



జడ్చర్ల టౌన్: పదోన్నతులు చేపట్టిన తర్వాతే బదిలీల ప్రక్రియ నిర్వహించాలని ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ కోరారు. మండలంలోని పెద్ద ఆదిరాల జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజన విరామంలో ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. పదోన్నతులు పక్కన బెట్టి బదిలీలు చేయటం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులు ఆనందం, అనురాధ, నర్సింహులు, మధు, వెంకటయ్య, నార్యనాయక్, లక్ష్మీశ్యాంసుందర్, శ్రీదేవి, సంధ్య, రఘు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం



జడ్చర్ల టౌన్: ప్రాచీన కళలను కాపాడుకుందామని ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాల కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి నుంచి పట్టణంలో రంగస్థల నటుడు వెంకటరత్నం నాయుడు స్మారకార్థం నిర్వహించిన నాటక ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్‌తో కలసి మాట్లాడారు. ప్రదర్శన సందర్భంగా స్థానిక కళాకారుడు అయ్యన్నకు నాటక నరసింహ బిరుదును గుమ్మడి గోపాల కృష్ణ ప్రదానం చేశారు. వెంకటరత్నం నాయుడు కుమారుడు కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి

కోయిల్‌కొండ: మండలంలో దళితబంధు పథకం లబ్ధిదారులు బ్యాంకు అకౌంట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం బ్యాంకుల్లో లబ్ధిదారులతో అకౌంట్లు ఓపెన్ చేయించారు. సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ సీటు బీసీలకు ఇవ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంళవారం హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ స్థానికులకు కేటాయించాలని రేవంత్‌ను కోరారు. నియోజకవర్గంలో 60 శాతం బీసీలు ఉన్నారని తెలిపారు. బీసీ సామాజికవర్గ నాయకులకే టికెట్ ఇవ్వాలని కోరారు. సీనియర్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, నాయకులు ఫహీం, ఫయాజ్, రాములుయాదవ్, ఫక్రుద్దీన్ ఉన్నారు.

నేడు ప్రొసీడింగ్‌ల అందజేత

రాజాపూర్: మండలకేంద్రంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్‌లను అందజేయనున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి మంగళవారం తెలిపారు. అదేవిధంగా కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత ఉంటుందన్నారు.

సభను విజయవంతం చేయాలి

చిన్నచింతకుంట: ప్రధాని మోదీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలను తరలించి విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎగ్గని నర్సింహులు కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే నెల 1న అమిస్తాపూర్ సమీపంలో సభ ఉంటుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్, మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి



హజిలాపూర్‌లో బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: 'ఎవరైనా చనిపోతే పింఛన్ వచ్చే పాత రోజులు కావాలా.. అర్హులందరికీ పింఛన్ ఇస్తున్న కేసీఆర్ ఉండాలో ప్రజలే నిర్ణయించుకోవాలి' ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. మంగళవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలకేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. తెలంగాణను అభివృద్ధి బాటలో పరుగులు పెట్టించింది కేసీఆర్ అన్నారు. ఇతర పార్టీల మాటలు నమ్మవద్దన్నారు. పది గ్రామాల్లో దాదాపుగా రూ. 25 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. హజిలాపూర్ రోడ్డు నుంచి రాంసింగ్‌తండా వరకు, కొల్లూర్ రోడ్డు నుంచి బట్టోనిపల్లి తండా వరకు, కొల్లూర్ రోడ్డు నుంచి సత్రోనిపల్లితండా వరకు రోడ్డు, పంచాయతీ భవనం, పాఠశాల అదనపు గదులు, సీసీ రోడ్డు, హెల్త్‌సబ్‌సెంటర్‌లను ప్రారంభించారు. 119 కల్యాణలక్ష్మి చెక్కులు, 139 గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు అందించారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతుబంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, కోఆప్షన్ తాహేర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'మీరే నాకు బాకీ పడ్డారు'

నవాబుపేట: 'మీరేనాకు బాకీ పడ్డారు.. ఓటుతో బాకీ తీర్చుకోవాల్సిన సమయం వచ్చింది' అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలను ఉద్దేశించి అన్నారు. దీంతో జనం ఒక్కసారిగా మౌనం వహించి అనంతరం ఒకే సార్ అంటూ జైకొట్టారు. మంగళవారం కూచూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం ఈ సన్నివేశం చోటు చేసుకుంది. కాగా గతంలో ఎమ్మెల్యేలు ఒక్క పని కూడా చేసేవారు కాదని గ్రామాలకు ఎప్పుడో కానీ వచ్చేవారు కాదన్నారు. కానీ తాను ప్రతి గ్రామంలో తిరుగుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నానని అన్నారు. అందుకే సేవలకు గుర్తుగా బాకీ తీర్చుకోవాలని వివరించారు. దీంతో కూచూర్ గ్రామస్తులు సార్ గతంలో కంటే ఇప్పుడు ఎక్కువ మందికి పింఛన్ వస్తోంది మీకే ఓటు వేస్తామంటూ నినాదాలు చేశారు. కాగా ఎమ్మెల్యే ఇటీవల చేస్తున్న బాకీ పడ్డారు నినాదం చర్చనీయంశంగా మారింది.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ముఖ్యం



రామయ్యబౌలి యూపీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ముఖ్యమని పాలమూరు మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు అన్నారు. 'సఫాయి మిత్ర సురక్ష'లో భాగంగా మంగళవారం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మోతీనగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) లో వైద్య శిబిరం ప్రారంభించారు. పట్టణంలోని నాలుగు యూపీహెచ్‌సీలలో ఈ శిబిరాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల్లో ఎవరికైనా ఏదైనా వ్యాధి ఉన్నట్లు తేలితే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి ఉచిత వైద్య సాయం చేయిస్తామన్నారు. కాగా మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 421 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మొదటిరోజు 152 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈనెల 28 వరకు పాతపాలమూరు, రామయ్యబౌలి, కుమ్మరివాడీ, మోతీనగర్ యూపీహెచ్‌సీలలో శిబిరాలు కొనసాగనున్నాయి. ఆయా కేంద్రాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్ రెడ్డి, గురులింగం, వాణీకుమారి పర్యవేక్షించారు.

కొనసాగుతున్న ఆశావర్కర్ల సమ్మె



రాజాపూర్: ఆశావర్కర్లు డిమాండ్‌లను పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె రెండో రోజు కొనసాగింది. మంగళవారం డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు. సువర్ణ, మాధవి, లక్ష్మీనర్సమ్మ, అలివేల పాల్గొన్నారు.

భూత్పూర్: తమ సమస్యలు పరిష్కరించే దాకా పోరాటాలు చేస్తామని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నారు. మంగళవారం బస్టాప్ వద్ద అంగన్‌వాడీలు, మీసేవా పక్కన ఆశా వర్కర్ల సమ్మెలు కొనసాగాయి. ఆశావర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి యాదమ్మ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు డిమాండ్ చేశాడు. మండలకేంద్రంలో సమ్మెలకు మంగళవారం మద్దతు తెలిపారు. కుర్వరమేష్, దశరథ్ ఉన్నారు.

కోయిల్‌కొండ: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ప్రభుత్వం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. మంగళవారం సమ్మెలో పాల్గొని మాట్లాడారు. రాజేశ్వరి, రామేశ్వరి, లావణ్య, చంద్రకళ, పద్మ, ఆనందమ్మ, గౌతమి, శిరీష, రాజమణి తదితరులు ఉన్నారు.

భవనాల నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు

భూత్పూర్: అమిస్తాపూర్, శేరిపల్లి(హెచ్) గ్రామాల మత్స్య భవనాల నిర్మాణాలకు రూ.10లక్షలు మంజూరు అయినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ బండ ప్రకాష్ నిధుల నుంచి మంజూరైన పొసీడింగ్స్ కాపీలను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగాన్ని వీక్షించిన వీసీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జీ–20 సమ్మిట్ విజయవంతంపై మంగళవారం ప్రధాని మోదీ దేశంలోని ఉన్నత విద్యాసంస్థల అధికారులు, వీసీలు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులతో ప్రత్యక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన పెద్ద స్క్రీన్‌లో ప్రసంగాన్ని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా.మధుసూదన్‌రెడ్డి, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ ప్రొ.పవన్‌కుమార్, ప్రత్యేక అధికారి యాదగిరిస్వామి తదితరులు వీక్షించారు.

28న మిలాద్ జులూస్

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాదున్నబీ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఈనెల 28న జులూస్ నిర్వహిస్తున్నట్లు మజ్లిస్ అహ్లె సున్నత్‌వల్ జమాత్ మిలాద్ జులూస్ జల్సా కమిటీ చీఫ్ ప్యాట్రన్ సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ, అధ్యక్షుడు మజహర్ హుస్సేన్ షహీద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సయ్యద్ అఫ్రోజ్‌షా ఖాద్రీ వెల్లడించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేడుకలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 28న అసర్ నమాజ్ అనంతరం సాయంత్రం 5 గంటలకు జులూస్ మక్కామసీద్ నుంచి ప్రారంభమై షాసాబ్‌గుట్ట దర్గా ఆవరణకు చేరుకుంటుందన్నారు. అనంతరం ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మికవేత్త మౌలానా అహ్మద్ నక్షబందీ ధార్మిక సందేశం ఇస్తారని తెలిపారు. మోటార్‌సైకిల్ లేకుండా పాదయాత్రగా జులూస్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎంకు వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలిస్తామని డిపో మేనేజర్ సుజాత అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎం కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఫిర్యాదులు తీసుకున్నారు. ఫోన్‌లో పలువురు కోరిన వినతుల గురించి పరిశీలిస్తామని డీఎం తెలిపారు.

సీస్ సర్వే సమగ్రంగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీస్ సర్వే ప్రాక్టీస్ పేపర్లను సమగ్రంగా చేపట్టాలని డీఈఓ రవీందర్ సూచించారు. మంగళవారం మెట్టుగడ్డలోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో సీఆర్‌పీలతో సమీక్షించారు. విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సీఆర్‌పీల సమ్మె కాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆన్ డ్యూటీగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ డి.శ్రీనివాస్, హెచ్‌ఎం విజయ్‌కుమార్, మిడ్‌డే మీల్స్ బాధ్యుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా వ్యవహరించాలి



నవాబుపేట: డెంగీ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్వేత సూచించారు. మంగళవారం కాకర్లపహాడ్‌లో డెంగీ సోకిన వారి ఇళ్లవద్ద దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. అనంతరం గ్రామంలో అనుమానితుల రక్త నమూనాలు సేకరించారు. ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎమైనా సమస్యలు తలెత్తితే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వైద్యసిబ్బంది సైతం అప్రమత్తంగా ఉండాలని పరీక్షలు చేయించే బాధ్యత వారిదేనన్నారు. సమయపాలన పాటించాలని హెచ్చరించారు. మండల వైద్యాధికారిణి విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రైతుల కోసమే సహకార వ్యవస్థ



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

దేవరకద్ర: రైతుల కోసమే సహకార వ్యవస్థ ఉన్నదని సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీఏసీఎస్ మహాజన సభలో మాట్లాడారు. రుణాలను సకాలంలో చెల్లించడం, రెన్యూవల్ చేయించుకోవడం చేయాలన్నారు. దేవరకద్రలో షాపింగ్ కాంప్లెక్స్, పీఏసీఎస్ భవనం, గోదాం వచ్చే నెల 4న ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సంఘం ద్వారా పెట్రోల్‌బంకు, సూపర్ మార్కెట్ ప్రతిపాదనలో ఉన్నాయన్నారు. సంఘం పరిధిలో 26 గ్రామాలు 6004 మంది సభ్యులు ఉన్నారని, దీర్ఘకాలిక రుణాల కింద రూ. కోటి 19 లక్షల 48 వేలు ఇచ్చినట్లు వివరించారు. రూ. 2 కోట్ల 67 లక్షల 17 వేలు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు రూ. 62 లక్షల 97 వేలు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. కొత్తగా రూ.80 లక్షల రుణాలు ఇవ్వడానికి ప్రతిపాదన చేశామని తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలను చదివి సభలో ఆమోదించారు. పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాసులు, డైరెక్టర్లు కృష్ణగోపాల్, ఎక్బాల్‌పాష, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, తిరుపతిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌కు అభినందన

అడ్డాకుల: పోల్కంపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు సుకన్య, ఆల యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్‌రెడ్డి దంపతుల కుమార్తె సాయి కార్తీకరెడ్డి ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి తైక్వాండో సెకెండ్ లెవల్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం మిఠాయి తినిపించి అభినందించారు.

పనితీరే ప్రామాణికం



గండేడ్: పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు వారి పనితీరే ప్రామాణికం అని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. మంగళవారం పలు గ్రామల కార్యదర్శుల పనితీరును జిల్ల ఎవల్యూషన్ కమిటీ సభ్యులు యాదయ్యతో పాటు డీపీఓ వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సత్యనారాయణ, డీఎస్పీ మహేష్‌గౌడ్ పరిశీలించారు. ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఎంపీఓ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహానికి వినతి

దేవరకద్ర: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు మంగళవారం దేవరకద్రలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి నిమజ్జనం చేస్తున్న సిబ్బంది



పెద్ద చెరువులో క్రేన్‌సాయంతో నిమజ్జనం

గణపయ్యా వెళ్లి రావయ్యా



కురుమవాడ గణపతి



తీగలపల్లికట్ట వినాయకుడి ఊరేగింపు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో గణనాథులు మంగళవారం రాత్రి నిమజ్జనానికి తరలారు. మధ్యాహ్నం నుంచే పట్టణంలో ఊరేగింపులు ప్రారంభమయ్యాయి. కళాకారుల ప్రదర్శనలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. దేవరకద్ర పెద్ద చెరువులో భారీ విగ్రహాలను క్రేన్ సాయంతో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈవో సీత్యానాయక్, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు.

జడ్చర్ల టౌన్: మండలంలో దుందుభీ తీరాన ఉన్న మీనాంబర పర్వవేదీశ్వరుడి ఆలయంలో మంగళవారం వినాయకుడి లడ్డూ వేలం నిర్వహించారు. బాదేపల్లికి చెందిన రంజిత్ బాబు రూ.55,116లకు లడ్డూను దక్కించుకున్నారు. వరసగా రెండో ఏడాది ఆయన లడ్డూ పొందడం విశేషం. కలశాన్ని రాళ్లచెరువు తండాకు చెందిన రమేష్‌నాయక్, హరియా రూ.11,116లకు దక్కించుకున్నారు.

ఉచిత విద్యుత్ అమలు చేయాల్సిందే..



జానంపేటలో ధర్నా చేస్తున్న దళితులు

అడ్డాకుల: జానంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం దళితులు ధర్నా చేశారు. కేవీపీఎస్ నాయకుడు మాణిక్యం రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కార్యాలయం ముందు బైఠాయించారు. ఉచిత విద్యుత్ కింద 101 యూనిట్లను 300 యూనిట్లకు పెంచాలని మాణిక్యం రాజు డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాము చేపట్టిన సర్వేలో ఎక్కడా 101 యూనిట్ల విద్యుత్ అమలు కావడం లేదని తెలిపారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు, కురుమూర్తి, ఖాదరయ్య, బాలయ్య, ఆంజనేయులు, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: దళితులకు 101 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29న జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్ తెలిపారు. మంగళవారం పాతపాలమూరులో ఉచిత విద్యుత్ అర్హుల కోసం సర్వే నిర్వహించారు. ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అధికారులు జీఓను అమలు చేయకుండా బలవంతంగా బిల్లులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పట్టణ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులు సంపన్నులు కావాలనే పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: గ్రామీణులు తమ కాళ్లపై తాము నిలబడి సంపన్నులు కావాలనే సీఎం కేసీఆర్ దళిత బంధు వంటి పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయిలో దళిత బంధు లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పథకంలో భాగంగా మొదటి విడతగా 100 మందికి, రెండవ విడతలో 500 మందికి లబ్ధి చేకూర్చేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. మరో 600 మందికి మూడో విడత అందేలా సీఎం కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం 42 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు.

అలుగులు పారిస్తాం.. పంటలు పండిస్తాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: వచ్చే ఏడాది నాటికి నియోజకవర్గంలోని ప్రతీ చెరువు, చెక్‌డ్యాంలు, కుంటలను పాలమూరు–రంగారెడ్డి పథకం కింద వచ్చే నీటితో నింపి ఎండాకాలంలో సైతం అలుగులు పారించి, పంటలు పండిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. అయోధ్యనగర్, అత్యకుంటతాండ, రామన్నపల్లి, వేపూర్, లింగన్నపల్లి గ్రామాల్లో రూ. 6.01కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రాన్ని పాలించిన వాళ్లు కనీసం తాగడానికి నీళ్లు ఇవ్వలేదన్నారు. వారి పాలన అంతమైన తర్వాతే స్వచ్ఛమైన మిషన్‌భగీరథ నీరు వస్తోందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇతర పార్టీలు ఇస్తున్న మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. వేపూర్‌లో క్రేన్ సాయంతో భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ కిష్టునాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

మహబూబ్‌నగర్ రూరల్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరం లాంటివని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు అవకాశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీ–హబ్ ద్వారా స్టార్టప్‌లు తమ ఉత్పత్తిని పెంచుకోవడానికి అవకాశం ఏర్పడిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలో ఇన్నోవేట్ తెలంగాణ కార్యక్రమం నిర్వహించారు. టాప్ ఇన్నోవేటివ్‌లను గుర్తించి వెలుగులోకి తెచ్చేందుకు టీ–హబ్ చేస్తున్న ప్రయత్నం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లా పరిధిలోని 178 స్టార్టప్స్‌ను ఆహ్వానించగా అందులో తుది దశకు పది ఎంపికయ్యాయన్నారు. వీటిలో లైఫెక్స్, జీటా పార్కింగ్ సొల్యూషన్స్ తదుపరి రౌండ్ కోసం ఎంపిక కావడంపై నిర్వాహకులను అభినందించారు. అవసరమైతే దివిటిపల్లి ఐటీ కారిడార్‌లో టీ–హబ్ కోసం స్థలం ఇస్తామన్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, టీ–హబ్ ప్రతినిధులు సాయి అభినయ్, గజేంద్ర, రాజీవ్ వైఎస్సార్, శీతల్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఐలమ్మ జయంతి



కావేరమ్మపేటలో వేడుకలు



కోడూర్‌లో..

సాక్షినెట్‌వర్క్ : జడ్చర్లలో చాకలి ఐలమ్మ జయంతి మంగళవాం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం రిజర్వేషన్ సమితి జాతీయ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కృష్ణయ్య, శివప్రసాద్, నాగరాజు, లక్ష్మయ్య, కృష్ణయాదవ్ పాల్గొన్నారు. చైర్‌పర్సన్ లక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

బాలానగర్‌లో రజకసంఘం అధ్యక్షుడు యాదయ్య, కృష్ణయ్య, రాములు, భాస్కర్, పెంటయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ వి.మోతీలాల్, ఇన్‌చార్జ్ ఏఎంసీ వెంకటేశ్వరావు, ఆర్ఓ నర్సింహులు పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గ్రీన్‌బెల్ట్‌లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రజక సంఘానికి పాత పాలమూర్‌లో ఎకరా స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు. కోడూర్‌లో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పి.నర్సిములు, ఎంపీటీసీ రాజు, మన్యంకొండ పాలక మండలి సభ్యుడు చిన్నయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఐలమ్మ విగ్రహానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మిడ్జిల్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల, కందూర్ గ్రామాల్లో మండల యాదవ సంఘం అధ్యక్షుడు భీమన్నయాదవ్, కందూర్ సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్‌లో రజక సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.